Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

# మేకిన్ ఇండియాలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి



(కాకినాడ, ప్రభన్యూస్): మేకిన్ ఇండియాలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఉద్బోధించారు. మేడిన్ ఇండియా, డిజిటల్ ఇండియాలు దూసుకు

**• రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్**

పోతున్నాయన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే భారత్ బలమైన అణుశక్తిగా ఎదిగిందన్నారు. ఎలాంటి ఛాలెంజ్‌నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా రూపుదిద్దుకుందన్నారు. కాకినాడ జవహర్‌లాల్ టెక్నాలజికల్ యూనివర్శిటీ 7వ స్నాతకోత్సవంలో గవర్నర్ కులపతి హోదాలో పాల్గొన్నారు. గాంధీజీ కలలుగన్న విధంగా భారత్‌ను ప్రస్తుత ప్రభుత్వం గొప్ప ఆర్థికశక్తిగా రూపుదిద్దుతోందన్నారు. ఇందులో ప్రజల్ని కూడా భాగస్తుల్ని చేస్తోందన్నారు. యువతను కేంద్రం ఇతోధికంగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రపంచంలోనే మన యువత ముందు స్థానంలో ఉందన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాల్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఫ్లాక్‌షిప్ ప్రోరామ్‌ల ద్వారా యువత తమ కలలను నెరవేర్చుకునే విధంగా శిక్షణ, తర్ఫీదు పొందాలన్నారు. మేకిన్ ఇండియా ద్వారా ప్రభుత్వం యువతలోని నైపుణ్య సామర్థ్యాల్ని వెలికితీస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి పెద్దపీటేస్తోందన్నారు. రాష్ట్ర వృద్ధిరేటు పెరిగేందుకు పలు కార్యక్రమాల్ని అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు, డాక్టరేట్‌లు అందించారు. వార్నిద్దేశించి మాట్లాడుతూ జెఎన్‌టియు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టపెంచుకుంటోందన్నారు. ఇక్కడి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారన్నారు. వీరిలో క్రమశిక్షణ, భక్తిభావం వెల్లివిరుస్తున్నాయన్నారు. ఇది సంస్థ పనితీరుకు నిదర్శనమన్నారు. సాంకేతిక విద్య ,మానవ వనరులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎమ్ రామలింగరాజు సంస్థ ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ సుబ్బారావు సంస్థలో అందిస్తున్న కోర్సుల వివరాల్ని తెలిపారు. అనంతరం బిహెచ్‌ఇఎల్ మాజీ చైర్మన్ బొంత ప్రసాదరావుకు జెఎన్‌టియు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది.

## ఘన స్వాగతం

తొలిసారిగా జిల్లాకొచ్చిన గవర్నర్‌కు హెలీపాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఉపముఖ్యమంత్రి పిల్లి బోస్, ఎంపిలు వంగాగీత, చింతా అనురాధ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మేయర్ సుంకర పావని, కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, ఎస్పి నయీంఅస్మీ తదితరులు ఆయనకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.